క్లుప్తంగా

పండిత్ పరిషత్ బలోపేతం చేద్దాం



అచ్చంపేట: రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్‌ను బలోపేతానికి పండిత్ ఉపాధ్యాయులు కృషి చేయాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ కోరారు. గురువారం అచ్చంపేట డివిజన్ స్థాయి పండితుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రెండు దశాబ్దాకాలం తర్వాత రాష్ట్రంలో అత్యధికంగా పండితులు పదోన్నతుల పొందారన్నారు. డివిజన్‌లోని అన్ని మండలాలకు ఆర్‌యూపీపీటీఎస్ బాధ్యులను నియమించామన్నారు. కార్యక్రమంలో రూప్లానాయక్, బురాన్, బసవయ్య, అర్జున్‌గౌడు, సాజిద్, సాయిజ్యోతి, జహంగీర్, జానయ్య, కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు ఘన సన్మానం

లింగాల: మండలంలోని అంబట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదేళ్ల పాటు హెచ్‌ఎంగా పని చేసి బదిలీపై వెళ్తున్న తాహెర్‌పాషాతో పాటు పలువురు ఉపాధ్యాయులను గురువారం గ్రామ యువకులు సన్మానించారు. నూతనంగా హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించిన జ్యోతిరాణికి శుభాకాంక్షలు తెలిపారు. యువకులు జంగయ్య, రాజేష్, ఎండీ మన్సూర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

మన్ననూర్: సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని మన్ననూర్‌లోని గిరిజన భవన్‌లో నిర్వహిస్తునట్లు ఐటీడీఏ కార్యాలయం వర్గాలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయని ముఖ్య అతిథిగా కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రోహిత్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. నల్లమల పరిసర ప్రాంతంలోని గ్రామాలు, గూడాలు, పెంటలకు చెందిన ఆదివాసీ చెంచులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నూలు పూర్ణిమను విజయవంతం చేయండి



అచ్చంపేట రూరల్: పట్టణంలోని భక్త మార్కండేయ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 19న నిర్వహించే 44వ నూలు పూర్ణిమను విజయవంతం చేయాలని పద్మశాలి సంఘం అధ్యక్షుడు పులిజాల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి కోట కిషోర్ కోరారు. గురువారం పట్టణంలోని పద్మశాలి కులస్తుల ఇంటింటికి తిరిగి ఆహ్వాన పత్రికను అందించారు. అన్నదానం కోసం నడింపల్లి గ్రామస్తులు గోపు రాఘవేందర్ ఒక క్వింటా బియ్యం వితరణ చేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, మల్లికార్జున్, రాజు, రమేష్, సైదులు, శ్రీనివాసులు, వెంకట్ పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



పెంట్లవెల్లి: మండల కేంద్రంలో గురువారం సీఎం రిలీఫ్‌ఫండ్, కల్యాణలక్ష్మి చెక్కులను మాజీ ఎంపీపీ గోవింద్ గౌడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు వైద్య రంగంలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్లు బొజ్జన్న, కృష్ణయ్య, నరేందర్ పాల్గొన్నారు.

నాలుగు ఉద్యోగాలకు ఎంపిక



కల్వకుర్తిరూరల్: మండలంలోని జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన దేవరకొండ సాయిరాం నాలుగు ఉద్యోగాలకు ఎంపికై అందరి మన్ననలను అందుకున్నారు. ఇటీవల విడుదల అయిన ఫలితాలల్లో సాయిరాం ఏఈఈ పబ్లిక్ హెల్త్, పాలిటెక్నిక్ లెక్చరర్, ఏఈ, గ్రూప్ 4 ఉద్యోగాలు సాధించాడు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం

బల్మూర్: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని జిల్లా వైద్యాధికారి స్వరాజ్యలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రికార్డులను తనిఖీ చేశారు. ప్రసూతి గది, మందుల నిల్వ ఉన్న గదిని పరిశీలించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ తారాసింగ్, డాక్టర్ ప్రశాంతి ఉన్నారు.

మొక్కలను నాటి సంరక్షిద్దాం



కోడేరు మండలం మూలమాడత తండాలో మొక్కలు నాటుతున్న అడిషనల్ కలెక్టర్ సీతారామారావు

కోడేరు: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని అడిషనల్ కలెక్టర్ సీతారామారావు అన్నారు. గురువారం స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మూలమడత తండాలో ఆయన మొక్కలు నాటారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సర్వే నెంబర్ 37లో రెండు ఎకరాల 10 గుంటల భూమిని ప్రభుత్వ భూమిని సర్వే చేయాలని తహసీల్దార్ విజయ్ కుమార్‌ను ఆదేశించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీఓ శ్రవణ్‌కుమార్, ఏపీఓ నాగరాజు ఆర్ఐ జంబులయ్య, తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: వ్యక్తిగత శుభ్రతతో ఆరోగ్యం కలుగుతుందని జిల్లా వైద్య అధికారిణి స్వరాజ్య లక్ష్మి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వివిధ కాలనీలో ఆమె పర్యటించారు. వర్షకాలంలో వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు.అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. వైద్య సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓం భీమనాయక్, రేణయ్య, మంజుభార్గవి, రామనర్సింహదేవ్, శ్రీనివాసులు, పర్వతాలు, మురళీ, మనోజ్, లక్ష్మణ్, గోవర్ధన్, మధు, శ్రీను, వైద్య సిబ్బంది ఉన్నారు.

తెలకపల్లి: మండల కేంద్రలోని గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని డీపీఓ కృష్ణ సందర్శించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్మికులకు గుర్తింపు కార్డులు, రూ.10 లక్షల జీవితబీమా బాండ్లను అందజేశారు. కార్యదర్శి భాస్కర్‌ను అభినందించారు. కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

లింగాల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనంలో ప్రజలు భాగస్వాములు కావాలని జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారి కృష్ణ కోరారు. మండలంలోని కొత్తకుంటపల్లిలో గురువారం నాల్గో రోజు నిర్వహించిన 'స్వచ్ఛదనం-పచ్చదనం'లో జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారి కృష్ణయ్య పాల్గొన్నారు. గ్రామంలో మొక్కలను నాటారు. ఎంపీడీఓ ఆంజనేయులు, ఎంపీఓ చంద్రశేఖర్, ఏపీఓ ఇమాంఅలీ, సింగిల్ విండో డైరెక్టర్ బాలరాజుగౌడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చారకొండ: మండలంలోని శాంతిగూడెం, గైరాన్ తండాలను ఎంపీడీఓ ఇసాక్‌హుస్సేన్, ఎంపీఓ వెంకటేష్ సందర్శించారు. చెట్ల ప్రాధాన్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో అభివృద్ధి పనులు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. అంతకుముందు గ్రామాల్లో మొక్కలు నాటారు.

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలో స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం కొనసాగుతోంది. అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

చారకొండ: పెంపుడు కుక్కలకు యాంటీ రేబీస్ టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశు వైద్యాధికారి శివకుమార్ అన్నారు. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వీఎల్ఓ మధర్, గోపాల మిత్ర శివరాం, వైద్యాధికారులు సీహెచ్ఓ శేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి గణేష్, అంగన్‌వాడీలు, అంశాలు తదితరులు ఉన్నారు.



వెల్దండలో..



లింగాల మండలం కొత్తకుంటపల్లిలో..



చారకొండలో..

భక్తిశ్రద్ధలతో ఆశ్లేష బలిపూజ



కన్యకా పరమేశ్వరి ఆలయంలో పాల్గొన్న భక్తులు

అచ్చంపేట: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో నాగుల ప్రతిష్ఠ సందర్భంగా రెండోరోజు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అర్చకులు ఆశ్లేష బలిపూజ చేపట్టారు. అనంతరం మహా నివేదన, మంగళహారతి భక్తిశ్రద్ధలతో కొనసాగింది. ఈనెల 9న నాగుల పంచమి పండగ సందర్భంగా దేవాలయంలో నాగుల ప్రతిష్టాపన ఉంటుందని ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కొరివి చంద్రశేఖర్, పాపిశెట్టి బాలరాజులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పూజారి శ్రీనివాసులు, కోశాధికారి కామిశెట్టి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణ చేస్తే సహించం



మన్ననూర్: అమ్రాబాద్ మండల కేంద్రంలోని కోదండ రామాలయానికి చెందిన భూముల అన్యాక్రాంతం సహించేది లేదని ఆర్య సమాజ్ రాష్ట్ర నాయకుడు పులిజాల శేఖర్, విశ్వహిందు పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు సంబు వెంకటరమణ అన్నారు. స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. సర్వే నంబర్ 1330లో ఆలయానికి చెందిన భూమి స్థిర ఆస్తిగా దశాబ్దాల కాలంగా మనుగడలో ఉందన్నారు. ఆ భూమిని కొందరు ముస్లింలు ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. అధికారులు జోక్యం చేసుకొని సంయమనంతో సమస్య పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో హిందు సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య రాష్ట్ర నాయకుడు జూలూరు సత్యనారాయణ, ఆర్‌ఎస్‌ఎస్ ప్రఖండ సంబు శ్రీనువాసులు, హిందువాహిని సభ్యుడు చంద్రమౌళి, బాలకృష్ణ, రాములు, శ్రీకాంత్, రుక్మిణి మహిళా సంఘం సభ్యురాలు సరస్వతి పాల్గొన్నారు.

అధ్యాపకులను నియమించాలి

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులను నియమించాలని బీజేపీ మండలాధ్యక్షుడు భీమేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలలు ప్రారంభమై మూడు నెలలు గడిచినా ఇప్పటికి లెక్చరర్లను నియమించలేదని వాపోయారు. పాఠాలు బోధించేవారు లేకపోవడంతో విద్యార్థులు కళాశాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు చొరవ తీసుకొని అధ్యాపకుల నియామకానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో తిరుమల్, రాజు, నాగరాజు, జగదీశ్, జి శివ, ఎం కృష్ణ, లింగారెడ్డి, ఎం శివ పాల్గొన్నారు.

మూడు కిరాణ దుకాణాల్లో చోరీ

కొల్లాపూర్ రూరల్: మండలంలోని చుకాయపల్లిలో మంగళవారం అర్ధరాత్రి మూడు కిరాణం దుకాణాల్లో చోరీ అయిన ఘటన చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం గ్రామానికి సమీపంలో కుడికిల్ల వెళ్లే రహదారిలో ఉన్న బండారు చంద్రశేఖర్, వెంకటమ్మ, గ్రామంలో ఉన్న మాధవి దుకాణంలో నగదుతో పాటు పలు వస్తువులను ఎత్తుకెళ్లారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తహసీల్దార్‌కు వినతి

నాగర్‌కర్నూల్‌రూరల్: కుక్కల బెడద నుంచి రక్షించాలని తిమ్మాజిపేట తహసీల్దార్‌కు గురువారం గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో కుక్కలు చిన్నారులు, వృద్ధులపై దాడులు చేస్తున్నాయని వివరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో గ్రామస్తులు కిరణ్‌మోహన్, మల్లేష్,రవికుమార్ ఉన్నారు.

డీఎస్పీ ఆకస్మిక తనిఖీ



పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని పోలిస్‌స్టేషన్‌ను గురువారం డీఎస్పీ బుర్రి శ్రీనివాస్ ఆకస్మిక నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం డీఎస్పీ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సీఐ మహేష్, ఎస్ఐ రామన్‌గౌడ్ ఉన్నారు.

అచ్చంపేట రూరల్: ఉప్పునుంతల మండలం లక్ష్మాపూర్ అంగన్‌వాడీ టీచర్ శారదపై వేధింపులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ యేసేఫ్ డీఎస్పీ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు అంగన్‌వాడీ టీచర్, ఆమె కుటుంబ సభ్యులను వేధిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

నాగదేవతకు ప్రత్యేక పూజలు



కోడేరులో పూజలు చేస్తున్న మహిళలు

కోడేరు: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో గురువారం నాగులచవితిని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. శివాలయాల్లో ఉన్న పుట్టలో పాలు పోశారు. అనంతరం శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకుడు జగం శివయ్య, నాగరాజు, గీత సీహెచ్ డీలరు శారద, చిన్న శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

లింగాల: నాగుల చవితి పర్వదినం సందర్భంగా మండలంలో గురువారం మహిళలు భక్తిశ్రద్ధలతో నాగదేవతకు పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల దేవాలయాల దగ్గర పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



వంగూరు: మండల కేంద్రానికి చెందిన మీసాల లక్ష్మయ్య ఇటీవల ట్రాక్టర్ ప్రమాదంలో మృతిచెందాడు. గురువారం వంగూరు గేట్ వద్ద ఉన్న వైపీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సంతాపసభలో మాజీ నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు హాజరై మాట్లాడారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని పేర్కొన్నారు. మాజీ జెడ్పీటీసీ సభ్యులు కేవీఎన్‌రెడ్డి, మాజీ సర్పంచులు అల్వాల్‌రెడ్డి, గణేష్‌రావు, గ్రామస్తులు శ్రీనివాస్, హమీద్, ఏపీ మల్లయ్య పాల్గొన్నారు.

ఆటో, క్యాబ్ డ్రైవర్లను ఆదుకోవాలి



కొల్లాపూర్: ఆటో, క్యాబ్ డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారెడు శివశంకర్, అధ్యక్షుడు కిరణ్ కుమార్ కోరారు. గురువారం పట్టణంలో ఆటోడ్రైవర్లతో వారు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో, క్యాబ్ డ్రైవర్లకు నెలకు రూ.12 వేలు చెల్లించాలన్నారు. ఉచిత బస్సు కారణంగా ఆటో, క్యాబ్ డ్రైవర్లు ఉపాధి కోల్పోయారన్నారు. 2019 మోటారు వాహనాల చట్టాన్ని రద్దుచేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ యూసూఫ్ తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనం ప్రారంభం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని జవాయిపల్లి పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనం ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయురాలు శోభరాణి ప్రత్యేక చొరవ తీసుకొని గ్రామ పెద్దలతో చర్చించి భోజనం వడ్డించేందుకు ఏజెన్సీ నిర్వాహకులను ఒప్పించారు. రెండు నెలలుగా తర్వాత పాఠశాలలో మధ్యాహ్న భోజనం ప్రారంభంకావడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లత, ఉపాధ్యాయులు చైతన్య, రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికి రుణమాఫీ చేయాలి

తెలకపల్లి: అర్హులందరికి రుణమాఫీ చేయాలని, ధరణి భూ సమస్యలను పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం బాల్‌న్సింహ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల పక్షాన నిరంతరం పోరాడుతామన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని సూచించారు. రూ.2 లక్షల వరకు 15వ తేదీలోగా రైతు రుణమాఫీ చేయాలన్నారు. రేషన్ కార్డుకు సంబంధం లేకుండా రుణమాఫీ వర్తింపచేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలలో రాబోయే ఎన్నికల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వార్డు మెంబర్లను అధిక మెజారిటీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. రాష్ట్ర కమిటీ సభ్యులు కేశవులు గౌడ్, వేనెపల్లి రవీందర్, శంకర్ గౌడ్, ఆంజనేయులు, బుగ్గ స్వామి, బిచ్చయ్య, విష్ణు, నిరంజన్, రామస్వామి, రేణు, తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు



రాచూర్‌తండాలో దాడులు చేస్తున్న ఎక్సైజ్ అధికారులు



కల్వకుర్తిలో..

కల్వకుర్తి రూరల్: వెల్దండ మండలం పెద్దాపూర్ తుంకిబండతండా, రాచూరు తండాల్లో గురువారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. రాచూరు నుంచి కల్వకుర్తి మండలం యంగంపల్లి గ్రామానికి బాల్‌రాజు ద్విచక్ర వాహనంపై 18 లీటర్ల సారా తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. బైక్ స్వాధీనం చేసుకునట్లు సీఐ జిల్లేల వెంకట్ రెడ్డి తెలిపారు. సిబ్బంది నజీర్ , రఘు, మహేష్, కృష్ణవేణి, నార్య, పరశురామ్ తదితరులు ఉన్నారు.

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు గురువారం విస్తృతంగా ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. మండలంలోని పెద్దాపూర్, తుంకిబండతండా, రాచూర్‌తండాల్లో సారా తయారీ కేంద్రాలపై అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సారా తయారు చేసిన, విక్రయించిన చర్యలు తీసుకుంటామన్నారు. దాడుల్లో కల్వకుర్తి ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి, సిబ్బంది నజీర్, రఘు, మహేష్, కృష్ణవేణి, నర్యా, పరశురామ్ తదితరులు ఉన్నారు.

దొంగ అరెస్టు

అచ్చంపేట రూరల్: నిద్రిస్తున్న మహిళ మెడలోని బంగారు పుస్తెల తాడును లాక్కెళ్లిన దొంగను పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ రాములు తెలిపిన వివరాల ప్రకారం గత మార్చి 10న ఇంటి ఆవరణలో నిద్రిస్తున్న ఓ మహిళ మెడ నుంచి రెండు తులాల బంగారు పుస్తెను గుర్తు తెలియని వ్యక్తి లాక్కెళ్లాడు. మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మంగళవారం రాత్రి పట్టణంలో ఒక వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్స్ మాథ్యూస్, తిరుపతిలు పట్టుకొని సేకరించారు. కోడేరు మండలంలోని రాజాపూర్‌కు చెందిన వాసిగా గుర్తించారు. బుధవారం రాత్రి జడ్జి ఎదుట నిందితుడిని హాజరుపరచగా జడ్జి తీర్పు మేరకు అతడిని రిమాండ్‌కు తరలించారు. నిందితుడిని పట్టుకున్న పోలీసులను డీఎస్పీ శ్రీనివాసులు అభినందించారు.

సమస్యల పరిష్కారంలో ప్రత్యేకాధికారులు విఫలం



తాడూరు: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంలో ప్రత్యేకాధికారులు విఫలం అయ్యారని సీపీఎం మండల శాఖ కార్యదర్శి కాశన్న ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలోని ఎస్సీ వార్డులో రోడ్డుపై మురుగు పారుతున్న ప్రదేశాన్ని పరిశీలించారు. ప్రత్యేకాధికారులు కార్యాలయాలకే పరిమితంకావడంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు గ్రామాల్లో పర్యటించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బలరాం, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ హాస్టళ్లను మూసివేయాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ స్కూల్ హాస్టళ్లను తక్షణమే మూసివేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమైక్య డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బి శివ వర్మ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో సీఐటీయూ కార్యాలయంలో జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టళ్లకు అనుమతులు లేకున్నా ఇష్టానుసారంగా చేర్చుకుంటున్నారని ఆరోపించారు. ఒక్కొక్క విద్యార్థి నుంచి రూ.30 నుంచి రూ.60 ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధులు బహిష్కరణ



కొల్లాపూర్/కల్వకుర్తిటౌన్: జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు న్యాయవాదులు రెండోరోజు విధులు బహిష్కరించారు. జగిత్యాలలో న్యాయవాద దంపతులు అమృతరావు, కవితరావులపై పోలీసులు దాడికి నిరసిస్తూ కోర్టు ఎదుట నిరసన తెలిపారు. దాడి చేసిన వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కల్వకుర్తి పట్టణంలోని సీనియర్, జూనియర్ సివిల్ కోర్టులో పనిచేస్తున్న న్యాయవాదులు విధులను బహిష్కరించి కోర్టు ఆవరణలో నిరసన తెలిపారు. కర్నె శ్రీహరి, వెంకటరమణ, శ్రీనివాసరావు, వసంతరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మనోహర్; గోవిందు, నళిని, రాజేష్, నాగరాజు తదితరులు ఉన్నారు.

యువతీ, యువకులకు శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ఆర్‌జీపీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాచమల్ల సిద్దేశ్వర్

మన్ననూర్: యువతీ, యువకులకు గ్రామాల పంచాయతీపై అవగాహన కోసం శిక్షణ తరగతులు నిర్వహిస్తునట్లు రాష్ట్ర పంచాయతీరాజ్ సంఘటన చైర్మన్ (ఆర్‌జీపిఆర్ఎస్) రాచమల్ల సిద్దేశ్వర్ పేర్కొన్నారు. గురువారం మన్ననూర్‌లోని అటవీశాఖ వనమాలిక ప్రాంగణంలో స్థానిక విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 16, 17వ తేదీలలో రెండు రోజుల పాటు మన్ననూర్‌లో అవగాహన, శిక్షణ తరగతులు నిర్వహిస్తునట్లు వివరించారు. గ్రామాలపై కనీసం అవగాహన ఉన్నవారిని ఎన్నుకుంటే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ మేరకు యువతీ, యువకులకు రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ ఆల్ ఇండియా చైర్మన్ మాజీ ఎంపీ మీనాక్షి నటరాజన్ పర్యవేక్షణలో నెహ్రూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూఢిల్లీ వారు శిక్షణ ఇస్తారని వివరించారు. ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ హాజరవుతారని పేర్కొన్నారు. ఉమ్మడి అమ్రాబాద్ మండలంలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఆర్‌జీపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చత్రునాయక్, నాయకులు విజయ్‌కుమార్, ధనస్సు, పవన్, కృష్ణ నాయక్, శివ, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమ్మె



పెద్దకొత్తపల్లిలో నిరసన తెలుపుతున్న కార్మికులు

నాగర్‌కర్నూల్‌రూరల్: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం ఎంపీడీఓ కోటేశ్వర్‌కు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పొదిల రామయ్య కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ, కురుమయ్య, వెంకటరెడ్డి, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ గురువారం పంచాయతీ కార్మికుల ఒకరోజు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల సంఘం అధ్యక్షుడు బాలస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ సిబ్బందికి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి, లేకుంటే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మల్లయ్య, యాదగిరి, రమేశ్, రవీందర్, ఎల్లమ్మ, దశరథం తదితరులు పాల్గొన్నారు.

బల్మూర్: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికుల ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దేశ్యానాయక్, శంకర్‌నాయక్, లాల్‌అహ్మద్, ఆంజనేయులు, బాలయ్య, గ్రామ పంచాయతీ కార్మిక సంఘం నాయకులు కొండయ్య, నిరంజన్, లక్ష్మయ్య, ప్రసాద్, ఆయా గ్రామాల పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో పంచాయతీ కార్మికులు సమ్మె చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ మద్దతు తెలిపారు. జిల్లా కోశాధికారి చిట్టెమ్మ, యూనియన్ మండలాధ్యక్షుడు కృష్ణయ్య పాల్గొన్నారు.